www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -154 శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు




**వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం చంద్రబాబు**

- దేశాన్ని ప్రగతి దిశగా నడుపుతున్నారు
- జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు
- మేకిన్ ఇండియాను బలోపేతం చేశారు
- నదుల అనుసంధానం ఆయనతోనే సాధ్యం
- మహిళలకు 33శాతం కోటా.. గేమ్ చేంజర్
- ఏపీకి కేంద్రం నుంచి పెద్దఎత్తున సహకారం
- వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం
- అవి వస్తే ఉపాధి, అభివృద్ధి: చంద్రబాబు




**అమరావతి/వారాణసీ /సెప్టెంబర్ (ప్రజావినికిడి):**
'సుస్థిరతతో నమ్మకం పెరుగుతుంది. నమ్మకంతో పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడుల వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి. అభివృద్ధీ జరుగుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీని దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా అభివర్ణించారు. మోదీ పాతికేళ్ల ప్రజాప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం వారాణసీలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'వారాణసీ-వడ్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు.దేశాన్ని మోదీ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తన ప్రసంగంలో పిలుపిచ్చారు. కాశీ పుణ్యక్షేత్రం మోదీ కర్మభూమి అని.. వారాణసీకి నేతను ఎన్నుకోవడమే కాదు...దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించిందని తెలిపారు. 'వీకేఎస్ అనేది అభివృద్ధి మంత్రం. **మిగతా 2లో...**

## ఇంధన భద్రతకే ప్రాధాన్యం



- రష్యా నుంచి ఆయిల్ కొనొద్దు..
- భారత్‌కు అమెరికా అల్టిమేటం..
- ఘాటుగా స్పందించిన న్యూఢిల్లీ
- రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును ఆమోదించిన యూఎస్ కాంగ్రెస్
- 100శాతం వరకు టారిఫ్‌లు విధించేలా చట్టంలో నిబంధన
- తమ ఇంధన భద్రతకే తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసిన భారత్
- ఈ చర్య ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తుందని యూఎస్‌కు న్యూఢిల్లీ వార్నింగ్

**ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను**మిగతా 2లో...**

## సెమీకండక్టర్ రంగంలో భారత్ దూకుడు..




- భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది: ప్రధాని మోదీ
- సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా
- నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్

**ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి **మిగతా 2లో...**

## వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

- పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి
- అమరవీరులకు నివాళులర్పించిన రేవంత్ రెడ్డి
- సామాజిక న్యాయమే పునాదిగా పాలన అందిస్తున్నామన్న సీఎం
- రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



2లో.

## 2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు


- నాటి ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనే వెల్లడించారు
- ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడినుంచి వచ్చాయ్?
- భూస్వాముల కుటుంబమైతే
- భూముల వివరాలు ఎందుకు దాచారు?
- నిలదీసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
తనకు 2004 వరకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని అదే ఏడాది కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ స్వయంగా వెల్లడించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సున్నా ఎకరాల నుంచి వేల కోట్ల ఆస్తులకు ఎదిగిన **మిగతా 2లో...**

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన




## జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

- వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ
- జనవరి 22 నుంచి తొలి విడత పరీక్షలు
- ఏప్రిల్ లో సెకండ్ సెషన్ పరీక్షలు
- అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు
- యూజీసీ నెట్, క్యూయెట్ పీజీ తేదీలు కూడా ఖరారు



2లో.

## మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు..

కేంద్రం కొత్త ప్రతిపాదనలు



2లో.

## రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కీసర సీఐ, ఎస్ఐ

- స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్ చేసిన పోలీసులు
- గతంలో బిర్యానీలు, కూల్ డ్రింకులు కూడా తెప్పించుకున్నట్లు ఆరోపణలు
- ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి విచారిస్తున్న ఏసీబీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
తెలంగాణలో ఇద్దరు పోలీసు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్**మిగతా 2లో...**

## డీజే వాహనాలను అడ్డుకోవద్దు

- వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతులు ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి
- ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని హోంమంత్రి, డీజీపీని కోరిన మంత్రి



**అమరావతి, సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి డీజే వాహనాల అనుమతులపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉత్సవాల సందర్భంగా డీజే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన హోంమంత్రి అనిత, డీజీపీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన **మిగతా 2లో...**

## నిరూపిస్తే రాసిస్తాం

### రేవంత్‌కు కేటీఆర్ ఛాలెంజ్

- 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తాం..
- సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్
- కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్
- 67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ
- రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు



**హైదరాబాద్ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**
మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు.గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను**మిగతా 2లో...**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఇంధన భద్రతకే ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంతరించుకుంది.

అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. "భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.

**ఏమిటీ కొత్త చట్టం?**

'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి.

అయితే, రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

**గట్టిగా బదులిచ్చిన భారత్**

అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని" కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

# సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

**మొదటిపేజీ తరువాయి**

కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# మెడికల్ షాపుల్లో సీసీటీవీ నిఘాలోనే మందులు.

## - కేంద్రం కొత్త ప్రతిపాదనలు

**ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**

డాక్టర్ల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సీసీ కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది.

సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం.. రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సీసీటీవీ వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి. ఈ దృశ్యాలను కనీసం మూడు నెలల పాటు భద్రపరచాలని ప్రతిపాదించారు.

ప్రిస్క్రిప్షన్ అవసరమైన మందులను కొన్ని చోట్ల సరైన వైద్య సూచన లేకుండానే విక్రయిస్తున్నారన్న ఆందోళనల నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. మందుల విక్రయంలో బాధ్యతను పెంచడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో అధికారులు తనిఖీ చేసేందుకు ఈ రికార్డులు ఉపయోగపడే అవకాశం ఉంది.

ఈ నిబంధన షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ మందులకే పరిమితం కాదు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌తో సరఫరా చేసే మందులన్నింటికీ వర్తించేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అయితే హోల్‌సేల్ వ్యాపారులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది.

ఇటీవల దగ్గు సిరప్‌ల విక్రయాలపై నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో తాజా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పిల్లలు, పెద్దలకు ఉద్దేశించిన కొన్ని మందులు సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఇవ్వడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వయసు, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందు, మోతాదు నిర్ణయించాల్సిన అవసరం ఉండటంతో ఈ అంశంపై కేంద్రం దృష్టి సారించింది. అయితే సీసీటీవీ నిబంధన ఇంకా అమల్లోకి రాలేదు. ఇది కేవలం ముసాయిదా మాత్రమే. ప్రతిపాదనపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన తర్వాత కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది. గెజిట్‌లో తుది నిబంధనలు ప్రచురించినప్పుడు ప్రభుత్వం పేర్కొనే తేదీ నుంచి మాత్రమే కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది.

# రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కీసర సీఐ, ఎస్ఐ

**మొదటిపేజీ తరువాయి**

స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, స్వీకరించిన కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్‌ఓ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు.

ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు బాధితుడిని, అతని స్నేహితుడిని ఇకపై వేధించకుండా ఉండేందుకు ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తమ ప్రకటనలో వెల్లడించింది. పోలీసుల వేధింపులు ఎక్కువవడంతో బాధితుడు నేరుగా ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా రూ.10 లక్షలు డిమాండ్ చేసిన పోలీసులు, చివరికి రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడితో గత కొన్ని రోజులుగా నిందితులు బిర్యానీలు, కూల్ డ్రింకులు తెప్పించుకుని వేధించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో గణేష్ నిమజ్జన డ్యూటీలో ఉన్న ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి, కీసర చెరువు సమీపంలో ఒక కారులో రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సూచన మేరకే ఎస్ఐ ఈ డబ్బును స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ అధికారులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, ఎస్ఐని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ అనంతరం ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఇద్దరినీ అరెస్ట్ చేసిన ఏసీబీ, వారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కీసర పోలీస్ స్టేషన్‌తో పాటు అధికారుల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు నిర్వహించింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్-ఫ్రీ నంబర్ 1064కు సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ ప్రజలకు సూచించింది.

# మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి పరుగులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మంత్రంతో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది.

వీ అంటే వడ్‌నగర్.. కే అంటే కాశీ.. ఎస్ అంటే సెప్టెంబరు' అని చెప్పారు. ఎన్‌డీఏ ఐక్యతే దేశానికి బలమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం పెద్దఎత్తున సాయం అందిస్తోందన్నారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు ఇస్తున్న మద్దతును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువలేరని తెలిపారు. దేశంలో భిన్న సంస్కృతులు, భిన్న భాషలు ఉన్నా.. దేశాభివృద్ధి, ఆత్మనిర్భరతే మన లక్ష్యమన్నారు. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. మోదీ ప్రభుత్వ విజయాలను చంద్రబాబు వివరించారు. 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని.. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయని చెప్పారు. 'జల్‌జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇవి అంకెలు మాత్రమే కాదు.. వీటి వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి మధ్యవర్తులూ లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు' అని తెలిపారు. ప్రపంచంలో వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారని.. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ విధానాలతో మేకిన్ ఇండియా కాన్ఫిడెన్స్‌ను బలోపేతం చేశారని ప్రశంసించారు. 'గతంలో రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీయే. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ఆయన కృషి అపూర్వం.. బేటీ బచావో-బేటీ పడావో, లఖ్‌పతి దీదీ స్కీంలు ఇందుకు నిదర్శనం. ఉజ్వల పథకం ద్వారా క్లీన్ ఫ్యూయల్‌ను ప్రోత్సహిస్తున్నారు. ముద్ర పథకం పెట్టుబడులు సమకూరుస్తోంది. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీశక్తి అధినియం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు. ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని చెప్పారు.

దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత మోదీదేనని సీఎం పేర్కొన్నారు. 'దేశం నలుమూలలకూ కనెక్టివిటీ పెంచారు. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతున్నాయి. నదుల అనుసంధానం మాత్రం పెండింగ్‌లో ఉంది.. ఇది కూడా మోదీ ద్వారానే సాధ్యమవుతుంది. బ్రహ్మపుత్ర, గంగ, మహానది, కావేరి, గోదావరి నదులను అనుసంధానం చేస్తే దేశానికి తిరుగుండదు. మోదీ సారథ్యంలో అభివృద్ధి పట్టణాలకే కాదు.. గ్రామీణ ప్రాంతాలకూ చేరింది' అని తెలిపారు. ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెట్టిన ఘనత మోదీదేనన్నారు. ఎవరైనా మన దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారని తెలిపారు. 'నేను కూడా నక్సలిజాన్ని ఎదుర్కొన్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు.. కానీ ఇప్పుడు దేశంలో నక్సలిజం, మావోయిజం అనేదే లేకుండా చేశారు. దటీజ్ నరేంద్ర మోదీ.' అని చెప్పారు.

**కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు**



కాశీవిశ్వనాథుడిని చంద్రబాబు దర్శించుకున్నారు. యోగి ఆదిత్యనాథ్, రాజ్‌నాథ్, చిరాగ్ పాసవాన్‌తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథుడిని పవిత్ర జలాలతో అభిషేకించారు. అర్చకులు ఆశీర్వదించి.. తీర్థప్రసాదాలు అందించారు. కేంద్ర మంత్రులు, యూపీ సీఎంతో కలిసి ఆలయ ప్రాంగణంలోని భక్తులకు సీఎం ప్రసాదం పంచారు. ఆయన వెంట ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీశ్ ఉన్నారు.

# నిరూపిస్తే రాసిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు.

ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

# వైభవంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం..

**హైదరాబాద్, సెప్టెంబర్ 1(ప్రజావినికిడి):**

తెలంగాణ వ్యాప్తంగా 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ' వేడుకలు సెప్టెంబర్ 17న అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ నాంపల్లిలోని చారిత్రాత్మక పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకునే ముందు గన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసు బలగాల నుంచి రేవంత్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా సీఎం ప్రసంగిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, స్వేచ్ఛ, సామాజిక న్యాయమే పునాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన 'ప్రజా పాలన'ను అందిస్తోందని స్పష్టం చేశారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# జేఈఈ మెయిన్-2027 తేదీలు వచ్చేశాయి!

**ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**

దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ - 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

జేఈఈ మెయిన్ - 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ - 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

# డీజే వాహనాలను అడ్డుకోవద్దు

**మొదటిపేజీ తరువాయి**

విడుదల చేశారు. వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని లోకేశ్ తెలిపారు. ప్రజల నుంచి ఈ విషయంపై తనకు అనేక సందేశాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ వెంటనే జోక్యం చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డీజే వాహనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సులభతరం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా రాష్ట్రంలో ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని ఆయన స్పష్టంగా సూచించారు. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగను జరుపుకునే వాతావరణం కల్పించాలని ఆయన పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.

# 2004 వరకు కేసీఆర్‌కు ఎకరా భూమి లేదు

**మొదటిపేజీ తరువాయి**

భూబకాసురుడు కేసీఆర్ అని గురువారం ఎక్స్ వేదికగా మంత్రి మండిపడ్డారు. ఎకరా భూమి కూడా లేదని తెలిపిన కేసీఆర్‌కు.. ఇప్పుడు 440 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక పదేళ్ల పాలనలో కేసీఆర్ భూములు భారీగా పెరిగాయని 2004 నాటి ఆయన ఎన్నికల అఫిడవిట్ స్పష్టం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుటుంబానికి రూ.కోట్ల ఆస్తులు సమకూరితే.. తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలాయన్నారు. ఇవాళ కేసీఆర్ వద్ద రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నాయంటే పేదలు, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లనే సాధ్యమైందని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద రూ.లక్ష కోట్ల ఆస్తులను కల్వకుంట్ల కుటుంబం అక్రమంగా సంపాదించిందన్నారు. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న కేటీఆర్.. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో వాటిని ఎందుకు చూపలేదు... అంటే ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారా..? ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో, 24 మండలాల్లో, 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి ఉందని, ఇదంతా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం శాసనసభలో ప్రశ్నించారని... ఇదే కాకుండా బినామీల పేరుతోనూ వందల ఎకరాలు దోచుకున్నారని, రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కేటీఆర్, ఆయన భార్య, పిల్లల పేరుతో ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, వెంకటాపూర్ పరిధిలో 123.19 ఎకరాలు ఉందన్నారు. అయితే 2009 ఎన్నికల సమయంలో కేటీఆర్ ఇచ్చిన అఫిడవిట్‌లో మాత్రం రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవరయాంజల్ సర్వే నంబరు 437లో ఎకరం వ్యవసాయ భూమి మాత్రమే ఉందని, దాని విలువ రూ.50 లక్షలుగా చూపారని మంత్రి తెలిపారు. కాగా కేటీఆర్ భార్య పేరుతో వ్యవసాయేతర భూమి అల్వాల్ పాకల్‌కుంట సర్వే నంబరు 569,676 పరిధిలో 660 గజాలు ఉందని, దాని విలువ రూ.67.20 లక్షలుగా చూపారన్నారు.. మల్కాజ్‌గిరి సర్వే నంబరు 171లో 534 చదరపు గజాల ప్లాట్, దాని విలువ రూ.32.04 లక్షలని, మొయినాబాద్ సర్వే నంబర్లు 94,99,100,101,102 పరిధిలో 400 చదరపు గజాలు ఉందని ఆయన పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**

తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 18 సెప్టెంబర్ 2026

# హమారాప్రసాద్ ను వెంటనేఅరెస్టు చేయాలి.




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** సూరారం అంబేద్కర్ భవనం నుంచి భారీ ర్యాలీ నిర్వహించిన బహుజన వాదులు అంబేద్కర్ వారసులు హమారా ప్రసాదు అనుచిత వ్యాఖ్యలు వ్యతిరేకిస్తూ గురువారం భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. సూరారం ఎక్స్ రోడ్లో దళిత సంఘాల ఐక్యవేదికమరియు విశ్వరత్న బహుజన వెల్ఫేర్ సొసైటీ నాయకులు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్పిఐపార్టీ నాయకులు జై భీమ్ మహాసేన నాయకులు మాల మహానాడు నాయకులు మహిళా నాయకులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించి హమారాప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి అంబేద్కర్ కల్పిత నాయకుడు అని కల్పిత వాక్యాలు చేస్తూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లకు రిజర్వేషన్ కల్పించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్రావ్ అంబేద్కర్ వారసులను ఆత్మగౌరాన్ని దెబ్బతీసేందుకు మతోన్మాదులతో చేతులు కలిపి భారతదేశంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రసాద్ వ్యక్తిని తెలంగాణ రాష్ట్రంలో అతన్ని వెంటనే అరెస్టు చేసి వారు చేసిన వాక్యాలను వెనక్కితీసుకొని బాబాసాహెబ్ అంబేద్కర్ కి బహుజనవాదులకు క్షమాపణ చెప్పాలి.. హమారాప్రసాదుని దేశద్రోహం చట్టం కింద అరెస్ట్ చేసి శిక్షించాల్సిన అవసరం తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సూరారం సిఐ కి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్ జేమ్స్ రామ్ చందర్ గట్టు అశోక్ కిషన్ రావు చింతూరు అశోక్ గౌతం మంచిది అంజనేయులు గజానంద్ నర్సింగ్ యాదవ్ రతన్ లక్ష్మణ్ అనిల్ డేవిడ్ మున్నా శిల్ప కార్ దిలీప్ చంద్రకాంత్ బుచ్చయ్య ఎన్ఎస్ రాజు, రవి,చైతన్య, గజ్జల రమేష్, యాదన్న, యాదమ్మ, బిక్షపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం-సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణసాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా షాపూర్ నగర్ లో ర్యాలీ..




**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట వారసులుపటేల్ సైన్యం నిజాం రజాకార్ గుండాలు భూస్వాములు అణిచివేసింది మట్టి మనుషులనే... సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండీ యూసుఫ్ సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్...కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 నుండి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జరిగిన సభలో సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు ఎండి యూసఫ్. సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ, భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించే కుట్ర జరుగుతుందని ఇది ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా మతోన్మాదులు అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మత పోరాటం కాదని వర్గ పోరాటమని అన్నారు ఈ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని మతోన్మాదులకు మతోన్మాద పార్టీలకు అనువంత సంబంధం కూడా లేదని అన్నారు భూమి భుక్తి వెట్టిచాకిరి నుంచి విముక్తి దొరల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన మహోజ్వల పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు ఈ పోరాటంలో చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావి నారాయణరెడ్డి, భీమిరెడ్డి, నరసింహారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, షేక్ బందగి,కాంచం కృష్ణమూర్తి, బద్దం ఎల్లారెడ్డి, మక్దూం మొయినుద్దీన్ లాంటి అనేకమంది అమరవీరులు దున్నేవానికి భూమి కావాలని దొరల నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ 3500 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి నాలుగువేల మంది కమ్యూనిస్టు నాయకులు కార్యకర్తలు అమరులయ్యారని అన్నారు. ఇట్లాంటి మహత్తర పోరాటాన్ని విమోచన దినమని విద్రోహ దినము అని రకరకాల పేర్లతో ప్రజలని మభ్యపెడుతున్నారని విద్రోహం విమోచన దినం కాదని విలీన దినమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఆశయాల సాధన కోసం పునరంకితమవుతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని ప్రభుత్వ ఆధీనంలో విద్య వైద్యం ఉపాధికై ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మండల కార్యదర్శి స్వామి సిపిఎం నాయకులు శీను, సుంకిరెడ్డి కరుణాకర్, మహేందర్ మల్లారెడ్డి, కనకయ్య,యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** మేడ్చల్ జిల్లా గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జాతీయ జెండాను అలాగే బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలు, ప్రజల ఐక్యత, త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారుతెలంగాణ అభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు,పోగు సమ్మయ్య నేత,మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,పార్టీ కుటుంబ సభ్యులు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం






**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17, (ప్రజావినికిడి):** శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవమును రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సౌజన్యంతో ఎల్బీనగర్ నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆందోజు శ్రీనివాస చారి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామీ ఆలయం నందు యజ్ఞ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర బిసి సంఘాల ఛైర్మన్ కుందారపు గణేష్ చారి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గత 20 సంవత్సరాల నుండి విశ్వకర్మ జయంతిని ఎంతో వైభవంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని యజ్ఞ కమిటీ అధ్యక్షులు చెన్నోజు వెంకటాచారి పేర్కొన్నారు. లోక కళ్యాణార్థం కొరకు,ప్రపంచ శాంతి కొరకు ఈ యజ్ఞ మహోత్సవం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘాలంతా సంఘటితమై సామాజిక రాజకీయ రంగాలలో రాణించాలని ఎల్బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘ అధ్యక్షులు ఆందోజు శ్రీనివాస్ చారి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాగోజు రామ చారి,గౌరవ అధ్యక్షులు పర్వతం శ్రీనివాస్ చారి,ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ చారి,నరసింహ చారి,యజ్ఞ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు మల్లాచారి, కోశాధికారి చేన్నోజు విష్ణుచారి,మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి,లక్ష్మి ప్రసన్న వివిధ డివిజన్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం మన పోరాట పటిమకు, స్వేచ్ఛకు ప్రతీక

## కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్





**శంషాబాద్ (ప్రజావినికిడి) సెప్టెంబర్ 17,** తెలంగాణ విమోచన దినోత్సవం మన పోరాట పటిమకు, స్వేచ్ఛకు ప్రతీక అని కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ పరిధిలోని 'మై ఫీల్ హోటల్' ప్రాంగణంలో జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడుఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం మన పోరాట పటిమకు, స్వేచ్ఛకు ప్రతీక. గులాబీ అధినేత, కేసీఆర్ మార్గదర్శకత్వంలో మరియు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో,వారి అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గాన్నికాటేదాన్ డివిజన్ను అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచడానికి మేమంతా నిరంతరం కృషి చేస్తున్నాం" అని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్క కార్యకర్త కేసీఆర్ ఆశయాల సాధనకు, పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాము యాదవ్, మైసిరెడ్డి,రాజేష్ యాదవ్,ప్రవీణ్, బాలరాజు యాదవ్, సంతోష్ గౌడ్, చికెన్ రాజు, రామస్వామి, రాజు,సునీల్, వెంకటరమణ, భాస్కర్,క్రాంతి, మల్లేష్,అనిల్, పద్మ,పుష్ప , శ్రీకాంత్ యాదవ్, రిష మరియు తదితరులు పాల్గొన్నారు

# కస్టమర్ సర్వీస్ విధానాన్ని మెరుగుపరిచి వేగవంతం చేస్తున్న ఎయిర్ ఇండియా..

salesforce

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** సేల్స్‌ఫోర్స్ ప్రపంచంలోని ప్రముఖ ఏఐ సీఆర్ఎం సంస్థ అయిన సేల్స్‌ఫోర్స్, కస్టమర్ సర్వీస్‌లో ఏజెంట్‌ఫోర్స్ వినియోగాన్ని ఎయిర్ ఇండియా విస్తరిస్తోందని నేడు ప్రకటించింది. ప్రారంభంలో రీఫండ్ ప్రక్రియకు మాత్రమే ఉపయోగించిన ఏఐ ఏజెంట్లను, ఇప్పుడు విమానయాన సేవల్లోని మరిన్ని క్లిష్టమైన పనులకు పరిష్కారం అందించేందుకు ఉపయోగిస్తోంది. ఏజెంట్‌ఫోర్స్ సహాయంతో, ప్రయాణికుల నిజమైన అవసరాలను అర్థం చేసుకుని, అభ్యర్థనలను ధృవీకరించి, సంస్థలోని ఎంటర్‌ప్రైజ్ సిస్టమ్స్‌తో తెలివిగా అనుసంధానమై, ప్రారంభం నుంచి ముగింపు వరకు నిరంతరాయమైన అనుభవాలను తక్షణమే అందిస్తూ ఎయిర్ ఇండియా తన కస్టమర్ సర్వీస్ విధానాన్ని పూర్తిగా మార్చుతోందనీ పేర్కొంది. వేగవంతమైన పరిష్కారాలు, సులభమైన కస్టమర్ ప్రయాణాలు, పెద్ద స్థాయిలో మరింత తెలివైన సేవలను అందించడం ద్వారా, భవిష్యత్తులో ఏజెంటిక్ ఎయిర్‌లైన్‌గా మారాలనే తన లక్ష్యం వైపు ఎయిర్ ఇండియా వేగంగా ముందుకు సాగుతోంది. ఈ విస్తరణ,రీఫండ్ ప్రక్రియ కోసం ఎయిర్ ఇండియా తొలిసారిగా ఏజెంట్‌ఫోర్స్‌ను ఉపయోగించిన దానికి కొనసాగింపుగా వచ్చింది. విమానయాన కార్యకలాపాల్లో రీఫండ్ ప్రక్రియ అనేది అనేక దశల ధృవీకరణలు, పాలసీ చెక్స్, బ్యాక్-ఎండ్ సిస్టమ్ అనుసంధానాలువివిధ టీమ్స్ మధ్య సమన్వయం అవసరమయ్యే అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. వేలిడేషన్స్, అప్రూవల్స్ బ్యాక్-ఎండ్ రీఫండ్ పనులను ఏజెంట్ ఫోర్స్ సమన్వయం చేయడం ద్వారా, ఎయిర్ ఇండియా ఇంటర్నల్ రీఫండ్ ప్రాసెసింగ్ సమయాన్ని సుమారుగా 14 రోజుల నుంచి సుమారు 4 గంటలకు తగ్గించడంలో సహాయపడిందనీ వెల్లడించింది.

# ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు

## విశ్వకర్మ సేవలు చిరస్మరణీయం



**శంషాబాద్ (ప్రజావినికిడి): సెప్టెంబర్17,** ప్రపంచపు తొలి వాస్తు శిల్పి , సృష్టికర్తగా పేర్కొన్న విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను గురువారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల మాధవచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా నర్కుడ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలోని పలు ప్రధాన వీధుల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో నర్కుడ గ్రామ శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షులు కమ్మరి ప్రకాష్ చారి,సుదర్శన్ చారి,శ్రీశైలం చారి,నరసింహ చారి,ప్రభు చారి, హరీష్ చారి, ప్రశాంత్ చారి, వడ్ల సిద్ధులు చారి,అఖిల్ జంగా చారి, ప్రవీణ్ చారి, రాము చారి, రాజు చారి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి, అండగా సర్పంచ్ భరత్



**వాజేడు,(ప్రజావినికిడి):** గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో ఆదివాసీ ముద్దుబిడ్డ మొడెం,ఉజ్వల్ కుమార్,తండ్రి మొడెం జనార్ధన్. వాళ్ళ అబ్బాయికి ఎంబిబిఎస్ మెడికల్ సీట్ సాధించిన ఆదివాసి ముద్దుబిడ్డ ను గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ భరత్ కుమార్ అభినందించారు. గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉజ్వల్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి 10,000 రూపాయలు సహాయం చేసారు సహాయం చేయగలిగిన దాతలు ముందుకు రాగలరని కోరుతున్నారు.ఈ పేద విద్యార్థికి అండగా వాజేడు మండల నాయకులు, ప్రజలు,దాతలు ముందుకు వచ్చి తోచిన సహాయం చెయ్యాలి అని అన్నారు

# అంబర్ పేట్ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం. సందర్భంగా అంబర్ పేట్ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీను హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలన్నారు.

సాయుధ పోరాటం తో ఎలాంటి సంబంధం లేని బిజెపి నేతలు, నాయకులు పోస్టల్ వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారు.నిజాం వ్యతిరేక పోరాటంలో గాని, స్వతంత్ర పోరాటంలో గాని,బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగినా పోరాటంతో గాని ఎలాంటి సంబంధం లేని బీజేపీ మత దృష్టితో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాత్మా గాంధీని హత్య చేసినందుకు ఆర్ఎస్ఎస్ పై నిషేధం విధించిన, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫోటోలు పెట్టి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నిజాం నిరంకుశ పాలనలో పటేల్, పట్వారి, జమిందార్, జాగిర్ధర్ వ్యవస్థకు, భూమికోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం విసునూరు రామచంద్ర రెడ్డి, జన్నారం ప్రతాపరెడ్డి మహిళల పట్ల వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం చేసింది కమ్యూనిస్టులు అని గుర్తు చేశారు. ఫలితంగా 4000 గ్రామాలకు విముక్తి చేసి 11.లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచింది కమ్యూనిస్టులే అని అన్నారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు రాములు, సోమయ్య,పార్టీ సభ్యులు ఏసు, శ్రీనివాసు, లక్ష్మణ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.


# గణపయ్య అనుగ్రహంతోనే సమస్త శుభాలు..

### ఎస్ఎన్ఎస్ డెవలపర్స్ సీఈఓ సబితా రెడ్డి..



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ లోని ఎస్ఎన్ఎస్ డెవలపర్స్ సీఈవో సబితా రెడ్డి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం గురువారం రోజు వారి కార్యాలయంలో వినాయక నిమజ్జనం అంగరంగ ఆటపాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ, ఏ శుభకార్యం తలపెట్టినా,ఏ నూతన పనిని ప్రారంభించినా అందరికంటే ముందుగా పూజలందుకునే ఆదిదేవుడు విఘ్నేశ్వరుడని,మన జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అడ్డంకులనైనా తొలగించి,విజయ తీరాలకు చేర్చే శక్తి ఆ గణనాథునికే ఉందని.బుద్ధికి, సిద్ధికి అధిపతి అయిన ఆ లంబోదరుని అనుగ్రహం ఉంటే కొండంత కష్టమైనా మంచులా కరిగిపోతుందని భక్తుల బలమైన నమ్మకమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ఎస్ డెవలపర్స్ సీఈవో సబితా రెడ్డి, కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మలు రాజకీయ శక్తిగా ఎదగాలి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 17,(ప్రజావినికిడి):**
విశ్వకర్మలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని విశ్వకర్మ ఐక్యవేదిక ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు పిలుపునిచ్చారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా చేపట్టిన శోభాయాత్రకు చార్మినార్ నుంచి ఉప్పల్ భగాయత్ కు వస్తున్న సందర్భంగా ఎల్బీనగర్ లోని మహనీయుల విగ్రహాల వద్ద స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం నాయకులు మారోజు వెంకటేశ్వరా చారి,చిలుకూరి రామాచారి మాట్లాడుతూ, ఉప్పల్ భగాయత్ లో విశ్వకర్మ సంఘం ఆత్మ గౌరవ భవనాన్ని వెంటనే నిర్మించాలన్నారువిశ్వకర్మల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.విశ్వకర్మ కులవృత్తులు చేయూత ఇవ్వడానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారోజు సురేశ్ చారి,మారోజు శ్రీనివాసా చారి, భాణఘర్ వేణుగోపాల్ చారి,ఇటికాల వెంకట రమణ చారి,అందోజు కృపాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# కవ్వగూడ అభివృద్ధికి రూ.3.30 కోట్లతో డబుల్ రోడ్డు

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా శంకుస్థాపన






**శంషాబాద్ (ప్రజావినికిడి) సెప్టెంబర్ 17:** శంషాబాద్ మండల పరిధిలోని కవ్వగూడ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది.గ్రామ సర్పంచ్ కుక్కల ఇందిరమ్మ అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని పలు పనులకు శంకుస్థాపన చేశారు.
కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ దొడ్డి నుంచి కవ్వగూడ గ్రామం వరకు రూ.3.30 కోట్ల నిధులతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.
కవ్వగూడ గ్రామ ప్రజలందరూ సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్ గుప్తా, చంద్ర రెడ్డి,మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, శంషాబాద్ మున్సిపాలిటీ మాజీ చేర్మెన్ సుష్మ మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు మహేందర్, కుక్కల బాలు ముదిరాజ్, కొత్వల్ గూడ డివిజన్ బొబ్బిలి శేఖర్,ప్రభు సాగర్,సర్పంచ్లు కోటేష్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, ఆంజనేయులు, లక్ష్మి లింగం, కవ్వగూడ మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, కవ్వగూడ గ్రామ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధి షాద్ నగర్ లో దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలలో భాగంగా గతంలో నిర్వహించిన వైద్య,అర్హత పరీక్షల ఆధారంగా ఎంపికైన దివ్యాంగులకు ఉచితంగా సహాయ పరికరాలను పంపిణీ చేశారు.కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అందే బాబయ్య,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.డీకే అరుణ లబ్ధిదారులకు స్వయంగా సహాయ పరికరాలను అందజేశారు.నడకలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు త్రైసైకిళ్లు,మోటారైజ్డ్ సైకిళ్లు, హ్యాండ్ సైకిళ్లు,వినికిడి లోపం ఉన్న వారికి శ్రవణ యంత్రాలు (హియరింగ్ ఎయిడ్స్)తో పాటు ఇతర సహాయ పరికరాలను పంపిణీ చేశారు.ఈ



సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ,ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవిస్తూ దేశానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగుల చేతుల మీదుగా ప్రధాని మోదీ మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సుల దీపం వెలిగించారు.

# షాద్ నగర్ నియోజకవర్గంలో ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు..

### ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జెండా ఆవిష్కరణలు..





**షాద్ నగర్,సెప్టెంబర్ 17,(ప్రజావినికిడి):**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తూ షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ ఆఫీస్,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, మండల ఆఫీస్,ఎమ్మార్వో ఆఫీస్,ఆర్డీఓ ఆఫీస్ లలో జాతీయ జెండా ఆవిష్కరణతో వేడుకలు ప్రారంభమయ్యాయి.షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు నిర్వహించి అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు,మున్సిపల్ ప్రజాప్రతినిధులు,తెలంగాణ జేఏసీ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడారు.

**భూమి,భుక్తి,వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాటం**
**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ భూమి,భుక్తి, వెట్టిచాకిరీ ముక్తి కోసం నాడు సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని,వారి త్యాగాల ఫలితంగానే నిరంకుశ నిజాం పాలన అంతమైందని పేర్కొన్నారు.1948లోనే ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రజలు ముస్లిం,హిందూ అనే భేదం లేకుండా సమిష్టిగా పోరాడారని, కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలోని ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని గుర్తుచేశారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అధికారికంగా ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తోందని స్పష్టం చేశారు.

**ఇది విముక్తి పోరాట దినం తెలంగాణ జేఏసీ**

తెలంగాణ జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, సెప్టెంబర్ 17వ తేదీని విమోచన దినంగా కాకుండా విముక్తి పోరాట దినం లేదా ప్రజా పోరాట దినం గా పరిగణించాలని అభిప్రాయపడ్డారు.ఇది కేవలం మతాల మధ్య జరిగిన పోరాటం కాదని,నిరంకుశ దొరలు, జమీందార్ల దోపిడీకి వ్యతిరేకంగా సామాన్య ప్రజలు,రైతులు రోకలిబండలు, తుపాకులు పట్టి చేసిన సాయుధ రైతాంగ పోరాటమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, ఎంపీడీవో శ్రీకాంత్,తాసిల్దార్ నాగయ్య,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందమోహన్,మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,మాజీ జెడ్పిటిసి సభ్యులు వెంకటరామిరెడ్డి,సింగల్ విండో చైర్మన్ చెల్లా శ్రీకాంత్ రెడ్డి,తుపాకుల శేఖర్,చెంది తిరుపతిరెడ్డి,ఎండి ఇబ్రహీం,దంగు శ్రీనివాస్ యాదవ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్,పట్టణ అధ్యక్షులు నల్లమోని శ్రీధర్,జేఏసీ సభ్యులు నక్క బాలరాజు,
ముబారక్ అలీ ఖాన్ సాదక్,పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భవన్ లో హైదరాబాద్ సంస్థానం విలీన దినోత్సవం..

**టిడిపి పార్టీ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు..**

**రాష్ట్రంలోని 22-ఏ భూ సమస్యలపై టీడీపీ గళం..**






**హైదరాబాద్, సెప్టెంబర్ 17,(ప్రజావినికిడి):** హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు జాతీయ జెండాను ఆవిష్కరించగా,పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ టిడిపి పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. మహాత్మాగాంధీ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటం భూమి,భుక్తి,విముక్తి కోసం సాగిందన్నారు. భూదానోద్యమం,భూ సంస్కరణలు,పేదలకు భూమి వంటి అంశాలను ప్రస్తావించారు. ఎన్టీఆర్ హయాంలో పటేల్-పట్వారీ వ్యవస్థ రద్దుతో బడుగు,బలహీనవర్గాలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 22-ఏ భూ సమస్యలతో బడుగు, బలహీనవర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం టీడీపీ నాయకులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారని తెలిపారు. ప్రభుత్వం 22-ఏ భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూముల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో.. రెండు వర్గాలు తమ వద్ద ఉన్న భూములపై పారదర్శకంగా వ్యవహరించి, పేదలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు సూచించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రస్తావించిన 22-ఏ సమస్యల పరిష్కారం ఎంతవరకు కార్యరూపం దాల్చుతుందో వేచి చూడాల్సి ఉందన్నారు.

అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ,దొడ్డి కొమురయ్య తదితరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారుసామాజిక న్యాయమే టీడీపీ ప్రధాన లక్ష్యమని,22-ఏ సమస్యల కారణంగా ఎక్కువగా ఇబ్బందులు పడుతున్న బడుగు,బలహీనవర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ ప్రసూన, జివిజి నాయుడు, నెల్లూరి దుర్గాప్రసాద్,పోలంపల్లి అశోక్, కందికంటి అశోక్‌కుమార్, అనంతరెడ్డి,సుభాషిణి, సైదేశ్వరరావు, గూడెపు రాఘువులు,రత్నాకర్‌రావు, జగదీష్,ఎంపీపీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

**నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్**



**శంషాబాద్ (ప్రజావినికిడి): సెప్టెంబర్ 17,** మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలో గురువారం తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ , జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం తెలంగాణ ప్రజల చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు చౌట రాజు, కనకమిడి విష్ణు, బుర్కుంట నాగరాజు, పర్వతం వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తొంట అశోక్, గూడెపు లక్ష్మణ్, పులిమామిడి శ్రీకాంత్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా కందకట్ల సిద్దురెడ్డి




**శంషాబాద్, (ప్రజావినికిడి): మేజర్ సెప్టెంబర్ 17:**
సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ సామాజికవేత్త సిద్దు రెడ్డి కందకట్ల ఆటో డ్రైవర్లకు అండగా నిలిచారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక, వైద్య భద్రత కల్పించే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 300 మంది ఆటో డ్రైవర్లకు రూ.3 లక్షల చొప్పున హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించనున్నట్లు సిద్దు రెడ్డి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.కోటి వ్యయంతో మూడు రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అవసరమైన సందర్భాల్లో ఈ ఆరోగ్య బీమాను మల్టిపుల్ టైమ్స్ వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు ఆటో డ్రైవర్ మృతి చెందితే, వారి కుటుంబానికి రూ.10.50 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు తాను అందించగలిగే చిన్న భరోసా ఇదేనని,మీరు ఒంటరిగా లేరు అనే ధైర్యాన్ని కల్పించడమే తన ఉద్దేశమని సిద్దు రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ లాంచ్ కార్యక్రమాన్ని ఈ నెల 18న శంషాబాద్‌లోని మల్లిక గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు, సామాజిక సేవా కార్యకర్తలు, స్థానికులు హాజరుకానున్నారు.

# మోదీ  జన్మదినం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ

**ప్రజాసేవే లక్ష్యంగా కొందుర్గు బీజేపీ నాయకుల సేవా కార్యక్రమం**



**కొందుర్గు,(ప్రజావినికిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కొందుర్గు మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ, ప్రజాసేవే పరమావధిగా భావించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 25 సంవత్సరాల ప్రజాసేవా ప్రయాణంలో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ మరింత కాలం దేశానికి సేవ చేయాలని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన, శక్తివంతమైన దేశంగా ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ప్రజాసేవా స్ఫూర్తితో ముందుకు సాగి, పేదలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తమ వంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. మోదీ సేవా స్ఫూర్తితో.. ప్రజాసేవే లక్ష్యంగా.. అభివృద్ధి చెందిన భారతదేశమే మన సంకల్పం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు బలవంత్ రెడ్డి, లక్ష్మయ్య గౌడ్, కొమరబండ శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్,ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి, సీనియర్ నాయకులు సున్నాళ్ళ అంజయ్య,లొద్దిల శ్రీశైలం,నావాది రెడ్డి,కారుకొండ సుధాకర్,శ్రీకాంత్,కార్తీక్, చందు,చంద్రశేఖర్ చారి,సురేష్, మల్లేష్,సిద్దయ్య, రామచంద్రయ్య, శ్రీనివాస్, అంజయ్య, కృష్ణారెడ్డి,సుభాన్ రెడ్డి,యాదిరెడ్డి,రమేష్,గిరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ



**నాగోల్,(ప్రజావినికిడి):**నాగోల్ డివిజన్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగోల్ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాగోల్ చౌరస్తా వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం దేశ స్వాతంత్ర్యం, తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా జి ఎస్ ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో జి ఎస్ ఐ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా చింతల అరుణ సురేందర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ విమోచన దినోత్సవం మన చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. తెలంగాణ విమోచన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజా సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం  విమోచన ఉద్యమం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ముఖ్య నాయకులు, యువ కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం చేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# రవీందర్ యాదవ్ జన్మదిన వేడుకలు

**జన్మదినం సందర్భంగా ఈశ్వర్ కాలనీలో మెగా హెల్త్ క్యాంప్**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జనహృదయ నేత షాద్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ జన్మదినం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. భీమారం మాజీ సర్పంచ్ గీత వీరేశం ఆధ్వర్యంలో,విజయ కార్డియాక్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు సూచనలు, సలహాలు అందించారు. రవీందర్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్, ఆర్భాట కార్యక్రమాలకు పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్,కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్,శారద శేఖర్,జయలక్ష్మి కిషోర్,వాణి పాండురంగారెడ్డి,మహమ్మద్ ఎజాజ్ (అడ్డు) గోపాల్,శివ ఎస్పీ,మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి,యుగంధర్,కానుగు అంతయ్య,చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్,చీపిరి రవి,ఆకుల శ్రీను, సలీంమొద్దీన్,రాజేందర్ సింగ్, ఎంసాని శ్రీనివాస్,పెద్ది రాము, నందిగామ శ్రీనివాస్,మల్చలం భిక్షపతి,భువనేశ్వర్ రెడ్డి,పి. భిక్షపతి,గుండు అశోక్,నవీన్, సుశాంత్,ప్రశాంత్ గౌడ్,నరేందర్ రెడ్డి,నక్కల మహేష్,స్థానిక వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేష్ గుప్తా, నవీన్ దుమ్మని,సంజు నాయక్, ప్రవీణ్,రాజేష్,రాకేష్,సతీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకదంతా యూత్ అసోసియేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**కొత్తూరు,(ప్రజావినికిడి):**
అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీలోని ఏకదంతా యూత్ అసోసియేషన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై వినాయకుని మండపంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ మాదారం నరసింహ గౌడ్,సోమ్లా నాయక్,మాజీ ఎంపిటిసి అనురాధ కృష్ణ గౌడ్,నాయకులు ప్రభాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,కమ్మరి యాదగిరి చారి,శ్రీను చారి సిటీకేబుల్ వెంకటేష్, వీరమోని శ్రీనివాస్ ముదిరాజ్,ఎరుకలి విష్ణుమూర్తి, యువ నాయకుడు శివ చారి,తుప్పర రవీందర్,సత్యం,డీసీఎం బాలు, రంజిత్,పరంధాములు గౌడ్,అనిల్,డేవిడ్,సురేష్, కిరణ్,బాలు,యూత్ సభ్యులు సాయి తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నాగోల్‌లో ఘనంగా "ఆశీర్వాద దీప" కార్యక్రమం





**నాగోల్,(ప్రజావినికిడి):**
గురువారం రోజు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్నిపురస్కరించుకొని నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ సీతారామ దేవాలయంలో ఆశీర్వాద దీప కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు మరియు దేశ సేవలో మరింత శక్తి,సామర్థ్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాద దీపాలను వెలిగించారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి అలాగే భారతదేశాన్ని మరింత బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నరేంద్ర మోదీ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తుచేసుకున్నారు. ఆయనకు ప్రజల ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల అరుణ సురేందర్ యాదవ్,నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగ శ్రీకాంత్, జిఎస్ఐ డివిజన్ అధ్యక్షులు శ్రీ ఎర్ర వినోద్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య, సంజీవరెడ్డి, బాలకృష్ణ గౌడ్, దప్పు రాజు, నరేందర్ రెడ్డి, రామదాయకర్ రెడ్డి,వాస్పరి మల్లేష్,నూకల పద్మారెడ్డి, పద్మారెడ్డి, సరస్వతి, మమత, ఉమారాణి, రాఘవచారి, శ్రీనివాస్,రావుల శ్రీనివాస్ జూలూరి నరేష్ తదితరులు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవ,దేశ అభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీ సీతారామ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షల తేదీలు ప్రకటించిన బోర్డు

**హైదరాబాద్,సెప్టెంబర్17(ప్రజావినికిడి):**
పోలీసు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే రాతపరీక్ష తేదీలను పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఎస్ఐ సివిల్ తత్సమాన పోస్టులకు నవంబర్ 29న, కానిస్టేబుల్ స్థాయి పోస్టులకు డిసెంబర్ 20న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది జూలై 29న నాలుగు నోటిఫికేషన్లు జారీ చేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే ప్రక్రియ ముగిసిపోవడంతో పరీక్ష తేదీలను రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. ఎస్ఐ, ఏఎస్ఐ స్థాయి పోస్టులు 298, కానిస్టేబుల్ స్థాయి పోస్టులు 7,139 కాగా, ఇందులో ఐదువేల పోస్టులు పోలీసుశాఖకు సంబంధించినవే. గత నెల 19 నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. 4.29 లక్షల మంది అభ్యర్థులు 5,77,064 దరఖాస్తులు సమర్పించారని, ఒకే పోస్టుకు దరఖాస్తు చేసిన వారు 68.45శాతం కాగా, రెండు పోస్టులకు దరఖాస్తు చేసిన వారు 28.88శాతం ఉన్నారని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వివరించింది. మొత్తం దరఖాస్తుల్లో బీసీ అభ్యర్థులవి అత్యధికంగా 49.19శాతం ఉన్నాయని, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులవి 43.60శాతం ఉన్నాయని, ఓసీ అభ్యర్థులు 7.20శాతం, ఇతర రాష్ట్రాల వారు 3.45శాతం ఉన్నారని బోర్డు అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో మహిళలవి 1,46,220(25.33 శాతం) ఉన్నాయని, పురుషులవి 4,30,844 (74.66శాతం) అని, ఆధార్ ఫేస్ ఔథెంటికేషన్‌ను ఇంకా 2.6శాతం మంది పూర్తి చేయలేదని, వారికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ పరీక్షలను తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని, కానిస్టేబుల్ పరీక్షలను పది ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు 15 నుంచి 18 కేంద్రాల్లో నిర్వహించే అవకాశం ఉందని వివరించారు.

## తుక్యానాయక్ తండాలో గణపయ్య పూజ, అన్నవితరణ కార్యక్రమం





### హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

**నందిగామ,(ప్రజావినికిడి):**
నందిగామ మండలం బండోనిగూడ గ్రామ పంచాయతీలోని తుక్యానాయక్ తండాలో వినాయక మండపంలో ఏర్పాటు చేసిన పూజ అదేవిదంగా అన్న వితరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమం పాల్గొని అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, ఏ శుభకార్యం తలపెట్టినా, ఏ నూతన పనిని ప్రారంభించినా అందరికంటే ముందుగా పూజలందుకునే ఆదిదేవుడు విఘ్నేశ్వరుడని,మన జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అడ్డంకులనైనా తొలగించి,విజయ తీరాలకు చేర్చే శక్తి గణనాథునికే ఉందని. బుద్ధికి, సిద్ధికి అధిపతి అయిన ఆ లంబోదరుని అనుగ్రహం ఉంటే కొండంత కష్టమైనా మంచులా కరిగిపోతుందని భక్తుల బలమైన నమ్మకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేగావత్ రామునాయక్, చేగుర్ కంటెస్టెడ్ సర్పంచ్ బంటారం మల్లేష్ గౌడ్, నాయకులు బండ మల్లేష్,రవి నాయక్, రమేష్ నాయకులు,శంకర్, నవీన్, పాండు, నర్సిమా, కుమార్,శ్రీశైలం, శ్రీను,రవీందర్, వినోద్, మహేందర్,శ్రీశైలం, నవీన్, అశోక్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సు

**హైదరాబాద్, సెప్టెంబరు 17(ప్రజావినికిడి):**



దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ, అనుబంధ రంగాల సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో జరగనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఈ సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ప్రసంగించనున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తారు.

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు
### : రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్




సికింద్రాబాద్ (ప్రజావినికిడి):
సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# చేతిలో స్మార్ట్‌ఫోన్.. దూరమవుతున్న బంధాలు.!

## ఒకే ఇంట్లో ఉన్నా... మనసులు మాత్రం వేరు వేరు

**సెప్టెంబర్ 17:(ప్రజావినికిడి):**
ఒకప్పుడు ఉదయం లేవగానే ఇంట్లో పెద్దలకు నమస్కారం.. ఇరుగు పొరుగు వారిని ఆప్యాయంగా పలకరించడం.. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులంతా కలిసి కాసేపు ముచ్చటించడం.. పండుగలు, శుభకార్యాల్లో బంధుమిత్రులతో సందడి చేయడం సహజంగా ఉండేది. కానీ కాలం మారింది.. సాంకేతికత పెరిగింది..స్మార్ట్‌ఫోన్ మనిషి జీవితంలో విడదీయరాని భాగంగా మారింది. ఒకే ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే.. వారి చేతుల్లో నాలుగు ఫోన్లు కాదు..ఒక్కొక్కరి వద్ద రెండు చొప్పున ఎనిమిది ఫోన్లు కనిపించే పరిస్థితి నెలకొంది. ఉదయం నిద్రలేచిన క్షణం నుంచి రాత్రి పడుకునే వరకు ఫోన్ వినియోగం కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు ఒకే చోట కూర్చున్నా..ఒకరితో ఒకరు మాట్లాడుకునే బదులు ఫోన్‌లోనే నిమగ్నమవుతున్నారు.



### పక్కనే మనిషి ఉన్నా.. పలకరింపు మరిచారు!

స్మార్ట్‌ఫోన్‌తో ప్రపంచం అరచేతిలోకి వచ్చినా.. పక్కనే ఉన్న మనిషితో మాట్లాడే సమయం మాత్రం తగ్గిపోతోంది. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటానికి సమయం కేటాయించకపోవడం.. పిల్లలు కుటుంబ సభ్యులతో ముచ్చటించకుండా ఫోన్లకే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. బంధాలను కలిపే పండుగలు..

### ఇప్పుడు ఫోన్లకే పరిమితం!

ఒకప్పుడు పండుగలు, శుభకార్యాలు అంటే బంధుమిత్రుల కలయికకు వేదికగా ఉండేవి. ఇప్పుడు అదే సందర్భాల్లోనూ సెల్ఫీలు, వీడియోలు, సామాజిక మాధ్యమాల చుట్టూనే ఎక్కువ సమయం గడుస్తోంది. పక్కనే ఉన్నవారితో మాటలు తగ్గి.. దూరంగా ఉన్నవారితో చాటింగ్ పెరుగుతోంది. సాంకేతికత అవసరమే.. కానీ నియంత్రణ కూడా అవసరం

స్మార్ట్‌ఫోన్ మన జీవితాన్ని సులభతరం చేసే సాధనమే కానీ.. అది కుటుంబ సంబంధాలను దూరం చేసే స్థాయికి చేరకూడదని పలువురు సూచిస్తున్నారు. రోజులో కొంత సమయాన్ని 'ఫోన్‌కు దూరంగా.. కుటుంబానికి దగ్గరగా' కేటాయిస్తేనే ఆత్మీయతలు, అనుబంధాలు తిరిగి బలపడతాయని చెబుతున్నారు. చేతిలో ఫోన్ ఉండాలి.. కానీ మనసును ఫోన్‌లో పెట్టకూడదు. మనిషి విలువ స్క్రీన్‌లో కాదు.. సంబంధాల్లో ఉంది!

# వారం రోజుల పోలీసు కస్టడీకి జోసెఫ్ రావణ్.. కోర్టు కీలక ఆదేశాలు

**అమరావతి సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**



సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ రావణ్ కేసులో గన్నవరం న్యాయస్థానం ఈరోజు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు విచారణలో భాగంగా జోసెఫ్‌ను ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు (సెప్టెంబరు 18) ఉదయం గన్నవరం పోలీసులు అతడిని కస్టడీకి తీసుకోనున్నారు.యువతను రెచ్చగొట్టేలా వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఓ సమావేశంలో నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఏపీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు, దీని వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాల కోణంలో లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, వారం రోజుల కస్టడీకి అంగీకరించడంతో రాబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనులపై మైనింగ్ శాఖ దాడి.. క్వారీ యంత్రాలు, వాహనాలు స్వాధీనం

**అనంతపురం సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**




అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు పరిధిలో అక్రమ మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన గనుల్లో లీజు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులపై మైనింగ్ శాఖ అధికారులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు.

సాంకేతిక బృందాలతో కలిసి రంగంలోకి దిగిన అధికారులు మైనింగ్ సరిహద్దులు, పరిమితికి మించిన క్వారీయింగ్ ఆరోపణలపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధునాతన మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా నిబంధనలను ఉల్లంఘించి ఎంత మొత్తం ఖనిజాన్ని అక్రమంగా తరలించారో తేల్చేందుకు సర్వే నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా.. మైనింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న హెవీ యంత్రాలు, పొక్లెయిన్లు, రవాణా వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ తనిఖీలపై మైనింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నేమకల్లు గనుల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. మైనింగ్ చట్టాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై విచారణ కొనసాగుతోందని, ఉల్లంఘనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

# 14 గంటల వెయిటింగ్.. గదులు లేవు, తిండి లేదు.. ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల కష్టాలు!


**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**




ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత అథ్లెట్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులకు సకాలంలో వసతి గదులు కేటాయించలేదు. దీంతో 12 గంటలకు పైగా, కొందరు 14 గంటల వరకు గదుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆహారం కూడా అందుబాటులో లేకపోవడంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది.భారత రోయింగ్ బృందానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఢిల్లీ నుంచి రెండు బృందాలుగా జపాన్‌కు బయల్దేరారు. బ్యాంకాక్‌లో విరామం తర్వాత తొలి బృందం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నాగోయా చేరుకుంది. అక్కడి నుంచి గంట తర్వాత వసతి కోసం ఏర్పాటు చేసిన క్రూజ్ నౌక వద్దకు వెళ్లారు. అయితే గదులు సిద్ధంగా లేకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది.ఓ రోయర్ 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు వసతి కేంద్రానికి చేరుకున్నామని, రాత్రి 8.30 గంటల సమయానికి కొద్దిమందికే గదులు లభించాయని తెలిపారు. గదులు పొందిన వారిని కూడా మరికొందరు క్రీడాకారులతో కలిసి ఉండాలని కోరినట్లు చెప్పారు.రోయర్లే కాకుండా భారత షూటర్లు, మరో రెండు జట్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు నివేదిక పేర్కొంది. షూటర్లకు కేటాయించిన వసతి కేంద్రాన్ని ఇతర దేశాల బృందాలకు ఇవ్వడంతో వారు మరో హోటల్‌లో బస చేయాల్సి వచ్చింది.భారత ఒలింపిక్ సంఘానికి చెందిన కొందరు సభ్యులను కూడా సమీపంలోని మరో హోటల్‌కు తరలించారు. వైద్య బృందం కూడా తాత్కాలికంగా వారితో కలిసి సర్దుకోవాల్సి వచ్చింది.క్రీడాకారులు, బృందాల సంఖ్యను నిర్వాహకులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు నివేదిక పేర్కొంది. అందుబాటులో ఉన్న వసతిలో కొంత భాగాన్ని ఇతర దేశాల బృందాలకు కేటాయించడంతో భారత అథ్లెట్లకు గదుల కొరత ఏర్పడినట్లు తెలిపింది. ఆసియా క్రీడల ఆరంభానికి ముందే వసతి ఏర్పాట్లలో తలెత్తిన ఈ గందరగోళం భారత బృందాలకు ఇబ్బందికరంగా మారింది.

# మోదీకి రాహుల్, ఖర్గే శుభాకాంక్షలు.. ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**



ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా ప్రతిపక్ష పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆకాంక్షించారు.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ప్రధాని నరేంద్ర మోదీజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యంతో దీర్ఘాయుష్షుతో ఉండాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీకి శుభాకాంక్షలు చెబుతూ.. మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం శుభాకాంక్షలు తెలిపారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది కూడా మోదీకి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ కూడా మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యం, సంతోషంతో సుదీర్ఘ జీవితం గడపాలని ఆకాంక్షించారు.మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ గురువారం 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 7తో మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తవుతాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 9న ప్రకటించారు.2014 నుంచి కేంద్రంలో మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగుతోంది. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాల్లో మోదీ కీలకంగా వ్యవహరించారు

# చంద్రశేఖరన్ పునర్నియామకం చట్టవిరుద్ధం

## : టాటా సన్స్ బోర్డుకు టాటా ట్రస్ట్స్ షాక్

**చంద్రశేఖరన్ పునర్నియామకంపై టాటా సన్స్ బోర్డు తీర్మానాన్ని తిరస్కరించిన టాటా ట్రస్ట్స్**

**ఈ తీర్మానం చట్ట ప్రకారం చెల్లదని, న్యాయబద్ధం కాదని స్పష్టీకరణ**

**ట్రస్ట్ నామినీ డైరెక్టర్ నోయెల్ టాటా తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు**

**మాజీ సీజేఐ చంద్రచూడ్ న్యాయసలహాను పరిగణనలోకి తీసుకోని బోర్డు**

**నాయకత్వ మార్పు ప్రక్రియ జరగాల్సిందేనని తేల్చిచెప్పిన టాటా ట్రస్ట్స్**

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**



టాటా గ్రూప్‌లో నాయకత్వ మార్పు వ్యవహారం కీలక మలుపు తిరిగింది. టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకం కోసం బోర్డు చేసిన తీర్మానాన్ని టాటా ట్రస్ట్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ తీర్మానం చట్టపరంగా చెల్లదని స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనితో టాటా సన్స్ బోర్డుకు, మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్‌కు మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో, తాను మళ్లీ చైర్మన్ పదవికి పోటీపడనని ఆగస్టు 12న చంద్రశేఖరన్ స్వయంగా బోర్డుకు తెలియజేశారు. ఆయన నిర్ణయాన్ని ఆమోదించిన టాటా ట్రస్ట్స్, కొత్త చైర్మన్‌ను ఎంపిక చేయడానికి సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని మరుసటి రోజే టాటా సన్స్‌కు సూచించింది.అయితే, గురువారం జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్‌ను తిరిగి నియమించాలంటూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నలుగురు డైరెక్టర్లు దీనికి అనుకూలంగా ఓటు వేయగా, ట్రస్ట్ నామినీ డైరెక్టర్ అయిన నోయెల్ టాటా ఈ ప్రతిపాదనను వీటో హక్కుతో వ్యతిరేకించారు.కంపెనీ నిబంధనల (ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్) ప్రకారం, చైర్మన్ నియామకానికి లేదా పునర్‌నియామకానికి ట్రస్ట్ నామినీ డైరెక్టర్లందరి మద్దతు తప్పనిసరి. నోయెల్ టాటా వ్యతిరేకంగా ఓటు వేసినందున ఈ తీర్మానానికి చట్టబద్ధత లేదని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఈ వాదనకు మద్దతుగా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.వై. చంద్రచూడ్ ఇచ్చిన న్యాయసలహాను కూడా నోయెల్ టాటా బోర్డు ముందు ఉంచారు. అయితే, బోర్డు దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. నాయకత్వ మార్పు ప్రణాళిక ప్రకారమే జరగాలని, తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని టాటా ట్రస్ట్స్ స్పష్టం చేసింది.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు.. మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు

**యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల నుంచి మినహాయింపు కోరుతున్న పెట్రోల్ డీలర్లు**

**రూ.2000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ విధింపుపై ఆందోళన**

**ఈ ఛార్జీలు తమ మార్జిన్లపై భారం మోపుతాయని డీలర్ల సంఘం ఆవేదన**

**డిజిటల్ మౌలిక వసతుల కోసమే ఎండీఆర్ అని వివరించిన పెట్రోలియం శాఖ**

**ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని తెలిపిన ఏఐపీడీఏ**

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**



పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్' (ఏఐపీడీఏ) ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు.

కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం, పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది.

ఎండీఆర్ అనేది ప్రభుత్వం గానీ, ఎన్‌పీసీఐ గానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికాం, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ. 2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు.

ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

# మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..

## ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

**ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ**

**యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం**

**'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం**

**ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన**

**యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ**

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 17(ప్రజావినికిడి):**



ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది.ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు.

ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు.

ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.

సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# మనకు మనమే శత్రువులం.. అవును, 100 శాతం వాస్తవం

## : శోభిత ధూళిపాళ

సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలు తాను కెరీర్ ప్రారంభించిన నాటి పరిస్థితులకు సంబంధించినవని, ఇప్పుడు పరిస్థితులు మారి ఉంటాయని ఆశిస్తున్నట్లు శోభిత స్పష్టం చేశారు. సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవాలని, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు అవసరమైన మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. 'గూఢచారి', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన శోభిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# చిరంజీవికి జోడీగా స్నేహా..?

## 'కాకా'పై భారీ అంచనాలు



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు.
మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే 'కె. సత్యం' అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ 'అమ్ములు పాప'గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు. ௦

# మంత్రాలయంలో ఉపాసన కొణిదెల ప్రత్యేక పూజలు



కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ భార్య ఉపాసన కొణిదెల పర్యటించారు. ఉదయాన్నే ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రాలయానికి చేరుకున్న ఆమెకు రాఘవేంద్ర స్వామివారి ఆలయ అధికారులు, పీఠం ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మంత్రాలయం పర్యటనలో భాగంగా ఉపాసన ముందుగా స్థానిక గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామివారి మూల బృందావనాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామిని దర్శించుకోగా, ఆయన ఉపాసనకు మంత్రాలయం విశేష శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉందని ఈ సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు, తమ అభిమాన కథానాయకుడు చరణ్ భార్య మంత్రాలయానికి వచ్చారన్న సమాచారం వ్యాపించడంతో... ఆమెను చూసేందుకు అభిమానులు, స్థానిక భక్తులు ఆలయ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంత్రాలయం మఠ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

# అమెరికాలో నాని 'ప్యారడైజ్'కు భారీ క్రేజ్..

## అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే లక్షల డాలర్లు


నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ అంచనాలను పెంచుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమా సృష్టిస్తున్న సంచలనం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం, ఒక రోజు ముందుగానే ప్రీమియర్ షోలతో సందడి చేయనుంది. నార్త్ అమెరికాలో ఇప్పటికే ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'ప్యారడైజ్' సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది.
శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టే ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే లక్ష డాలర్ల మార్కును దాటి, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన తెలుగు చిత్రంగా రికార్డు సృష్టించింది. మధ్యలో బుకింగ్స్ కాస్త నెమ్మదించినా, విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మళ్లీ ఊపందుకున్నాయి.
తాజాగా ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు వెల్లడించిన వివరాల ప్రకారం, నార్త్ అమెరికాలో ప్రీమియర్ల కోసం ఇప్పటివరకు 15,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రీ-సేల్స్ రూపంలోనే 350ఖ (సుమారు రూ. 3.35 కోట్లు) డాలర్ల వసూళ్లు దాటినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నాని సినిమాలకు మొదటి నుంచి యూఎస్‌లో మంచి మార్కెట్ ఉండటంతో, 'ప్యారడైజ్' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
ఈ చిత్రంలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఏషనాగుల' పాట యూట్యూబ్‌లో కేవలం 17 రోజుల్లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఎలాంటి ట్రైలర్ లేకుండానే ఈ సినిమా నేరుగా థియేటర్లలోకి రానుంది.
సినిమాపై ఉన్న నమ్మకంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ప్రీ-సేల్స్ మరింత పెరిగి, 'ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




# 'రణబాలి' నుంచి బిగ్ అప్డేట్..

## షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టిన మూవీ టీమ్


విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రీకరణ పూర్తయింది. గత 130 రోజులుగా నిర్విరామంగా సాగుతున్న షూటింగ్‌కు చిత్రబృందం గుమ్మడికాయ కొట్టింది. ఈ విషయాన్ని దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. తన చిత్ర బృందాన్ని 'అలుపెరుగని సైన్యం'గా అభివర్ణిస్తూ, ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. భారీ అంచనాల నడుమ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టి-సిరీస్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. విడుదలకు చాలా ముందే సినిమా సిద్ధమవుతుందని, ఇప్పటికే మొదటి భాగం నేపథ్య సంగీతం (బీజీఎం) కూడా పూర్తయిందని చిత్రబృందం తెలిపింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్, రష్మిక కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న 'జయమ్మ' పాత్రకు తన తల్లి పేరు పెట్టుకున్నట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఇటీవల వెల్లడించారు. "రణబాలి గుండెల్లో ప్రేమగా, ఆత్మలో స్ఫూర్తిగా, వెన్నెముకలో ధైర్యంగా, అతని పిచ్చిలో మాధుర్యంగా జయమ్మ పాత్ర ఉంటుంది" అని ఆయన అభివర్ణించారు. రష్మిక తన నటనతో జయమ్మ పాత్రకు ప్రాణం పోయడమే కాకుండా ఆ పాత్రను శాశ్వతంగా నిలిచిపోయేలా చేసిందని ప్రశంసించారు.




# సరైన తోడు దొరికితే రెండో పెళ్లికి సిద్ధం

## : సీనియర్ నటి ప్రేమ

ఒకప్పటి ప్రముఖ హీరోయిన్, తెలుగు, కన్నడ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ప్రేమ తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తోడు అనేది ముఖ్యమని, తనకు నచ్చిన, తనను అర్థం చేసుకునే వ్యక్తి దొరికితే రెండో వివాహం చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రేమ, తన పెళ్లి, విడాకుల గురించి ప్రస్తావించారు. 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పచ్చును వివాహం చేసుకున్నానని, అయితే కొంతకాలం తర్వాత అభిప్రాయ భేదాలు రావడంతో 2016లో ఫ్యామిలీ కోర్టు ద్వారా పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని చెప్పింది. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నట్లు పేర్కొంది. రెండో పెళ్లి గురించి మాట్లాడుతూ "జీవితానికి తోడు ముఖ్యం. సరైన వ్యక్తి దొరికితే 70 ఏళ్ల వయసులోనైనా పెళ్లి చేసుకుంటాను. దీనికి వయసుతో సంబంధం లేదు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం" అని ప్రేమ పేర్కొంది. గతంలో తన ఆరోగ్యంపై వచ్చిన వదంతులను కూడా ఆమె ఖండించింది. తనకు క్యాన్సర్ సోకిందంటూ వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో వచ్చే ప్రతీ వార్తను నమ్మవద్దని పేర్కొంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613